
సాక్షి నిర్మల్

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



ఆస్వాదిద్దాం రండి...

విద్యార్థులకు సెలవుల కాలం.. పదోతరగతి, ఇంటర్, తదితర పరీక్షలన్నీ పూర్తయ్యాయి. విహారయాత్రలకు వెళ్లలేనివారికి నిర్మల్ జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. 6లో▸



అభివృద్ధి చేస్తే ఆహ్లాదమే..!

భైంసా పట్టణశివారులో గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంటుంది. ప్రాజెక్టు సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పార్కు గతంలోనే ఏర్పాటు చేశారు. 7లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /22.4

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ద్రోణి ప్రభావంతో మధ్యాహ్నం తర్వాత చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా న్యాయవాదులు



జడ్జిని సన్మానిస్తున్న నిర్మల్ న్యాయవాదులు

నిర్మల్ టౌన్: న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమరసత దివస్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ హైకోర్టు జడ్జి ఎం.సుధీర్‌కుమార్‌ను నిర్మల్ జిల్లా న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. జడ్జిని కలిసిన వారిలో న్యాయవాద పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరేందర్, ఉపాధ్యక్షులు ఎస్.గంగాధర్, రమణ, కోశాధికారి ఎస్.రాజు, మధుకర్ తదితరులు ఉన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఐఈవో

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని సహాయార జూనియర్ కళాశాలను డీఐఈవో పరశురామ్‌నాయక్ శనివారం తనిఖీ చేశారు. కళాశాలలో వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతికశాస్త్రం ప్రయోగ శాలలను పరిశీలించారు. అధ్యాపకుల హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు రాజేశ్వర్, శ్రీనివాస్, ఎస్.భోజన్న, నర్సయ్య తదితరులు ఉన్నారు.

'మన్‌కీ బాత్' వీక్షణకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న రమాదేవి

భైంసాటౌన్: ప్రధాని నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ వందో ఎపిసోడ్‌ను జిల్లా ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, మన్‌కీ బాత్ జిల్లా కన్వీనర్ పడిపెల్లి గంగాధర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఆదివారం 11 గంటలకు మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని బూత్ అధ్యక్షులు, మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, జిల్లా నాయకులు ప్రజలను భాగస్వాములు చేస్తూ మన్‌కీ బాత్ వీక్షించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాద్‌లోని శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా విద్యకు అర్హులైన అనాథ బాలికలు, పేద బాలికలు, అక్రమ రవాణాకు గురయిన బాలికలు, సంరక్షణ కేంద్రంలో ఉన్న బాలికలు, మహిళా సంస్థలో ఉన్న బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీర్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ డిప్లమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో ఒక్కో విభాగానికి 60 సీట్లు ఉన్నట్లు వివరించారు. అనాథ బాలికలు, పేదరికంలో ఉన్న బాలికలు, అక్రమ రవాణాకు గురయిన బాలికలు, సంరక్షణ కేంద్రంలో ఉన్న బాలికలు మరియు మహిళా సంస్థలో ఉన్న బాలికలకు 70 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు 3 శాతం, కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే బాలికలు నేరుగా జిల్లా మహిళా, శిశు వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులకు మే 10 తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

ఆటాడుకుందాం రా..



- రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు
- నెల రోజులపాటు ఉచిత శిక్షణ
- 14 ఏళ్లలోపు చిన్నారులకు మాత్రమే..
- నిపుణులైన పీఈటీల నియామకం
- సమ్మర్ క్యాంప్‌కు రూ.1.05 లక్షలు



శిక్షణ శిబిరంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఆటలతోపాటు సబ్జెక్టుపై అవగాహన

వేసవి శిబిరాల్లో భాగంగా విద్యార్థులు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. 9 నుంచి 10 గంటల వరకు గణితం, ఆంగ్లం, విజ్ఞానశాస్త్రంపై అవగాహన కల్పిస్తారు. ఆటలతోపాటు మూడు సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా ప్రణాళిక రూపొందించారు. పాఠ్యాంశాల్లో తమ స్థాయిని తెలుసుకునేందుకు, పట్టు సాధించేందుకు విద్యార్థులకు ఇవి కూడా ఉపయోగపడతాయని అధికారులు పేర్కొంటున్నారు.



నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాలలకు వేసవి సెలవులు మొదలయ్యాయి. ఏడాదిపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇప్పుడు ఆట పాటల్లో నిమగ్నమయ్యారు. అయితే విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఆట పాటల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. మే 1 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇచ్చేలా జిల్లా క్రీడా శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం నిపుణులైన పీఈటీలను ఎంపిక చేశారు. వారికి శిక్షణ కూడా ఇచ్చారు. సమ్మర్ క్యాంపుల్లో ఇచ్చే శిక్షణ పూర్తిగా ఉచితం. ఆహ్లాదకరమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన క్రీడాకారులు, పీఈటీల పర్యవేక్షణలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 10 శిబిరాలు, ఆయా పంచాయతీల ద్వారా మరో 113 శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వేసవిలో ఇళ్లలో ఖాళీగా ఉండే పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

సమయం వృథా కాకుండా..

14 ఏళ్లలోపు బాలబాలికలు ఈ వేసవి శిక్షణ శిబిరాలకు అర్హులు. వేసవి సెలవులు వృథా కాకుండా వారికి ఇష్టమైన ఆటల్లో ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. ఆధునిక యుగంలో పిల్లలు స్మార్ట్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి, చిన్న వయసులోనే అనారోగ్యాలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవులను గ్రామీణ, పట్టణ ప్రాంతం పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్లుగా ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల ఆవరణ, అందుబాటులో ఉన్న మైదానాలు, క్రీడా ప్రాంగణాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

నిధుల కేటాయింపు..

జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.05 లక్షలు కేటాయించింది. క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.50 వేలు, ఒక్కో కోచ్‌కు రూ.4 వేల చొప్పున జిల్లాలో 10 శిక్షణ శిబిరాలకు రూ.40 వేలు కేటాయించారు. ప్రమాదంలో గాయాలైతే ప్రాథమిక చికిత్స అందించేందుకు మెడికల్ కిట్‌కు రూ.5 వేలు, ఇతరత్రా నిర్వహణకు రూ.10 వేలు ఖర్చు చేయనున్నారు.

నైపుణ్యం మెరుగు..

ఆటలకు దూరమైన పాఠశాలలకు చెందిన పిల్లలు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగు పర్చుకోవచ్చు. ముఖ్యంగా వేసవిలో సమయం వృథా కాకుండా ఇష్టమైన ఆటను నేర్చుకుని పట్టు సాధించే అవకాశం ఉంటుంది. సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చు. ఆటలు ఆడుకునే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. భవిష్యత్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలుంటాయి. క్రీడల్లో పతకాలు సాధిస్తే క్రీడా కోటా కింద ఉన్నత విద్య అభ్యసించవచ్చు. ఉపాధి అవకాశాలకు కూడా ఆ పతకాలు ఎంతో ఉపయోగపడుతాయి.

శిబిరాలు నిర్వహించే క్రీడాంశాలు..

అర్బన్ పరిధిలో..

మార్షల్ ఆర్ట్స్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారం

రూరల్ పరిధిలో..

క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారం

అన్ని వసతులు కల్పిస్తాం..

వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకునేలా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉంటుంది. ఇప్పటికే కోచ్‌లకు శిక్షణ అందించాం. శిక్షణ శిబిరాల్లో తాగునీరు, తదితర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి.

– క్రాంతికుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి

మళ్లీ 'చెర'వుల్లోకి..!



ఎన్‌టీఆర్ మార్గ్ వైపు మంజులాపూర్ చెరువులో నింపుతున్న మట్టి

- గతంలో కోర్టు ఆదేశించినా..
- శిఖంలో కట్టడాలు కూల్చినా..
- మారని తీరు.. ఆగని కబ్జాలు
- పట్టించుకోని అధికారులు

నిర్మల్: ఎన్ని దశాబ్దాలైనా జిల్లాకేంద్రంలో నీటిసమస్య లేదంటే అందుకు గొలుసుకట్టు చెరువులే కారణం. చుట్టూ ఉన్న అన్ని జిల్లా కేంద్రాల్లో తాగు నీటి కటకట ఉన్నా.. ఇప్పటికీ ఇక్కడ సమస్య తలెత్త లేదు. మండు వేసవిలో సైతం నిండుగా ఉండే గొలుసుకట్టు చెరువులతో నిర్మల్‌లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. కానీ.. కొన్నేళ్ల తర్వాత పరిస్థితి తారుమారయ్యేలా ఉంది. గొలుసుకట్టు చెరువులను చెరబట్టడమే ఇందుకు కారణం. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా పెడచెవిన పెడుతున్నారు. మళ్లీ చెరువుల్లోకి చొచ్చుకెళ్తున్నారు. ఎఫ్‌టీఎల్(ఫుల్‌ట్యాంక్ లెవల్), శిఖం అనే తేడా లేకుండా చెరువు గర్భం వరకూ వెళ్లేలా ఉన్నారు. సంబంధిత అధికారులు, పాలకులూ చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అదే కథ..

ఇప్పటికే నిర్మల్‌కు కబ్జాలకు కేరాఫ్ అన్న పేరుంది. కోర్టుల ఆదేశాలను పెడచెవిన పెడుతూ తాజాగా చెరువుల్లో మట్టిపోసి చదును చేస్తున్నారు. జిల్లాకేంద్రంలో పెద్దదైన స్థానిక మంజులాపూర్ చెరువులో ప్రియదర్శిని నగర్ ఎన్‌టీఆర్ మార్గ్‌వైపు ఇష్టారీతిన మట్టిని నింపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులోకి చొచ్చుకెళ్తున్నారు. ఏడాదిన్నర క్రితం కోర్టు ఆదేశాల మేరకు ఇక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. తాజాగా అదే ప్రాంతంలో మట్టి నింపుతున్నారు.

గతంలో..

చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఓ వైపు మిషన్ కాకతీయ పథకాన్ని అమలు చేస్తే.. జిల్లాలో మిషన్ కబ్జా కార్యక్రమం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం జిల్లాలోని కూరన్నపేట, ఇబ్రహీం చెరువుల్లో అక్రమంగా మట్టిని నింపుతున్నారని, నిర్మాణాలు చేపట్టారని పలువురు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు సీరియస్‌గా స్పందించి, జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి కలెక్టర్ ముషరఫ్‌అలీ ఈ విషయంలో పలుమార్లు కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చింది. చివరకు కోర్టు ఆదేశాల మేరకు మట్టిని తొలగించడం, అందులోని కట్టడాలను కూల్చివేశారు. అలాగే నూతన కలెక్టరేట్, జిల్లా పోలీసు భవనానికీ కోర్టు మొట్టికాయలు తప్పలేదు. కొచ్చెరువు ఎఫ్‌టీఎల్ దాటి సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపట్టాల్సి వచ్చింది. పోలీసు కార్యాలయాన్ని మొత్తానికి అక్కడి నుంచి షిఫ్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి ఉదాహరణలు కళ్లముందే ఉన్నా.. ఇప్పటికీ కొందరు చెరువుల్లోకి చొచ్చుకెళ్తూ గొలుసుకట్టు చెరువుల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం, 'మాములు'గా తీసుకోవడమూ ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులను కబ్జా చెర నుంచి కాపాడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వారం రోజుల్లో 'సమీకృతం' పూర్తి చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



కలెక్టరేట్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నూతన సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్ పనులను శనివారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలు చేశారు. బ్లాక్‌ల వారీగా ప్రతీ గదిని పరిశీలిస్తూ కప్‌బోర్డ్స్, వైరింగ్, విద్యుత్ తదితర పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతీ బ్లాక్ క్లీన్ చేయాలని, కలరింగ్, సిమెంట్ పడినచోట శుభ్రం చేయాలని ఆదేశించారు. లిఫ్ట్, విద్యుత్ అంతరాయం కలుగకుండా జనరేటర్ తదితర పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే సుందరీకరణ పనులు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం మొదలగు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మే మొదటి వారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మే 5వ తేదీలోపు భవనం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ వెంట రోడ్లు భవనాల శాఖ అధికారి వి.అశోక్, ఉద్యానవన శాఖ అధికారి శ్యామ్‌రావ్‌రాథోడ్ ఉన్నారు.

పశు సంతతి పెంచాలి

పశుసంవర్ధక శాఖలో అండమార్పిడి, కృత్రిమ గర్భధారణ ద్వారా రైతులకు మేలుజాతి దూడలను అందించాలని, పశు సంతతి వృద్ధి పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి అభివృద్ధికి, రైతులకు పశుపోషణ, పశుగ్రాస పెంపకం, పాల దిగుబడి, పెరటి కోళ్ల పెంపకం, పొట్టేలు పిల్లల పెంపకంలో శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ గజ్జారం, డాక్టర్ నారాయణరెడ్డిని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శంకర్, జిల్లాలోని వివిధ మండలాల్లో పని చేస్తున్న పశు వైద్యాధికారులు, రిలయన్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

ఖానాపూర్: పట్టణంలో అక్రమ వెంచర్లతోపాటు, అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోవాలని ఖానాపూర్ పట్టణ కౌన్సిలర్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని పేర్కొన్నారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. అనుమతులు లేకండా వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా సెల్లార్లలోనూ అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ పథకంతో ఎటువంటి ఉపయోగం లేదని, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించలేకపోతున్నామని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేష్, అమానుల్లాఖాన్, కిశోర్‌నాయక్, తొంటి శ్రీనివాస్, షబ్బీర్‌పాషా ఉన్నారు.

షాపుల యజమానులతో సమావేశం



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజినల్ ఎగ్జిక్యూటివ్

నిర్మల్ టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో షాపులు ఏర్పాటు చేసుకున్న యజమానులతో డిపో మేనేజర్ సాయన్న శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సంధాని మాట్లాడుతూ.. యజమానులు ప్రతీనెల 10వ తేదీలోగా అద్దె చెల్లించాలని కోరారు. ఇప్పటి నుంచి ఆన్‌లైన్‌లో అద్దె చెల్లించాలని తెలిపారు. ఇందుకోసం టీఎస్ ఆర్టీసీ వెండర్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. జూన్ 1 నుంచి నగదు తీసుకోకూడదని పేర్కొన్నారు. సమావేశంలో కంట్రోలర్ కేఎం.రెడ్డి, మతిన్‌ఖాన్, సమీర్, వాహిద్, ఖాదర్, శ్రీధర్, సాయి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



చేతన్

లక్ష్మణచాంద: మండలం కేంద్రానికి చెందిన దూస చేతన్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చాడు. శనివారం ప్రకటించిన మెయిన్స్ సెకండ్ ఫలితాల్లో దూస లక్ష్మీనారాయణ–రాజమణి దంపతుల కుమారుడు చేతన్ జాతీయ స్థాయిలో 3,860 ర్యాంక్, ఓబీసీ కేటగిరీలో జాతీయస్థాయిలో 737 ర్యాంక్ సాధించాడు. చేతన్ 7వ తరగతి వరకు నిర్మల్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో, 8, 9 హైదరాబాద్‌లోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 10వ తరగతి నిర్మల్ పట్టణంలో జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీఅబిద జూనియర్ కళాశాలలో చదివాడు. జేఈఈ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన చేతన్‌ను పలువురు అభినందించారు.

అడెల్లుకు అంబేద్కర్ స్ఫూర్తి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అడెల్లు

నిర్మల్‌చైన్‌గేట్: సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న జిల్లాకు చెందిన కొంతం అడెల్లుకు భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్ఫూర్తి పురస్కారం–2023 లభించింది. అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు.

'ఉపాధి'ని నీరుగారుస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న బొప్పని పద్మ

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగారుస్తోందని, ఇందులో భాగంగానే బడ్జెట్‌లో కోత విధించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొప్పని పద్మ ఆరోపించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం శనివారం టీఎన్జీవో భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చి వాళ్ల రుణాలు మాఫీ చేస్తున్న ప్రభుత్వం ఉపాధి కూలీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.2.50 లక్షల కోట్లు కేటాయించి గడ్డపారలు, తట్ట, పార కొనుగోలు చేసి ఇవ్వాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి గృహలక్ష్మి స్కీమ్ అమలు చేయాలన్నారు. సొంతంగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం, పది లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, జిల్లా కమిటీ సభ్యులు సుంచుల నారాయణ, తిమ్మాపురం దేవేందర్, నాయకులు ఎర్రన్న పాల్గొన్నారు.

మంత్రికి గెస్ట్ లెక్చరర్ల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న అతిథి అధ్యాపకులు

నిర్మల్‌చైన్‌గేట్/సారంగపూర్: డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అతిథి అధ్యాపకులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అతిథి అధ్యాపకులు రవీందర్, నరేందర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1905 మంది పనిచేస్తున్నారని, తమకు ప్రతినెలా వేతనాలు అందడంలేదన్నారు. ఒక నెలలో 72 తరగతులకు బోధిస్తేనే వేతనాలు ఇస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, ఒత్తిడి ఇలా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు రవీందర్, అర్గుల నరేందర్, తిరుపతిరెడ్డి, షహిస్తా, రంజిత్‌కుమార్, మురళీ ధర్, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ల వినతి..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం నాయకులు శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిశారు. సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంఘ భవనానికి స్థలాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు.

జీపీఎస్‌ల సమ్మెకు రూ.25 వేల ఆర్థికసాయం

నిర్మల్‌చైన్‌గేట్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఖానాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం శనివారం సంఘీభావం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మెలో భాగంగా ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. నిరవధిక సమ్మె ఖర్చుల కోసం రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమన్నారు. మద్దతు తెలిపిన వారిలో జి.కిశోర్‌నాయక్, కాంగ్రెస్ ఖానాపూర్ జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, బీజేపీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్, కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

హైకోర్టు జడ్జికి సన్మానం


జడ్జిని సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్‌: ఆదిలాబాద్ సందర్శన నిమిత్తం జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ.ప్రియదర్శినిని సంగెం చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. శాలువా, మెమొంటోతో సత్కరించారు. జిల్లా న్యాయమూర్తిగా ఆదిలాబాద్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

పోగొట్టుకున్న డాక్యుమెంట్లు అప్పగింత


డాక్యుమెంట్లు అందజేస్తున్న మేనేజర్

నిర్మల్‌టౌన్‌: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న విలువైన డాక్యుమెంట్లు అప్పగించి కండక్టర్ ఏడినాథ్ నిజాయతీ చాటుకున్నాడు. నిజామాబాద్ నుంచి నిర్మల్ బయలుదేరిన బస్సులో ప్రయాణించిన శ్రీకృష్ణ తన సంబంధించిన డాక్యుమెంట్ల కవర్ బస్సులోనే మరిచిపోయాడు. వాటిని గుర్తించిన బస్సు కండక్టర్ ఏడినాథ్ కంట్రోలర్‌కు అప్పగించాడు. కంట్రోలర్ అందులో ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా శనివారం బాధితుడిని పిలిపించి డీఎం సాయన్న చేతుల మీదుగా డాక్యుమెంట్లు అందజేశారు.

తప్పుడు నంబర్ ప్లేట్లతో దర్జాగా..


నకిలీ నంబర్‌తో వాహనదారుడు

ఆదిలాబాద్‌టౌన్‌: ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై పోలీసులు జరిమానా విధిస్తున్నారు. వాటినుంచి తప్పించుకునేందుకు పలువురు తమ వాహనాలకు తప్పుడు నంబర్ ప్లేట్లు పెట్టుకుని దర్జాగా తిరుగుతున్నారు. ఇలాంటి సంఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన బండి అర్చన పేరిట స్ప్లెండర్ ప్లస్ వాహనం రిజిష్టరై ఉంది. ఈ వాహనం నంబర్ టీఎస్01 ఈక్యూ 5314 ఉండగా మరో వ్యక్తి తన వాహనానికి ఇదే నంబర్ పెట్టుకుని తిరుగుతున్నాడు. ఇటీవల తలమడుగు మండలం ఖోడద్ సమీపంలో పోలీసులు హెల్మెట్ లేదని ఈ నంబర్ గల వాహనానికి జరిమానా విధించడంతో అసలు విషయం బయటపడింది. వారం రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ కారు యాజమాని సైతం ఇలాగే దొంగ నంబర్ పెట్టుకుని తిరుగుతుండగా పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

పులిదాడిలో గాయపడిన ఆవు మృతి

పెంచికల్‌పేట్‌: మండలంలోని మురళీగూడలో తలండి నారాయణకు చెందిన ఆవుపై శుక్రవారం పులి దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఆవు మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.


చారిత్రాత్మక భత్తీస్‌గఢ్ కోట



గండి రామన్న హరితవనం


భత్తీస్‌గఢ్ కోటపై ఉన్న ప్రహరీ

ఆస్వాదిద్దాం రండి...



విద్యుత్ కాంతుల్లో శ్యాంఘడ్ కోట

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు సెలవుల కాలం.. పదోతరగతి, ఇంటర్, తదితర పరీక్షలన్నీ పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులంతా విహారయాత్రలకు వెళ్లేందుకు, ప్రకృతిఒడిలో సేద తీరేందుకు ఇదే సరైన సమయం. ఇందుకోసం వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేనివారికి ఇక్కడే మన చెంతనే జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే సహ్యాద్రి పర్వత శ్రేణులలోని మహబూబ్ ఘాట్స్.. స్వర్ణనది గోదావరిలో కలిసే సోన్ సంగమ ప్రదేశం, పార్కులు.. వెరసి చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వీటికితోడు చారిత్రక ప్రదేశాలు శ్యాంఘడ్, బత్తీస్‌ఘడ్, నిర్మల్ కోటలు ఇక్కడే ఉన్నాయి. వీటిపై 'సాక్షి' కథనం.

- వేసవి కాలక్షేపం మన చెంతనే
- సేదతీరే ఆహ్లాదం ఇక్కడే..
- చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో..
- చారిత్రక నేపథ్యం కూడా...
- దూరభారం, వ్యయప్రయాసల్లేవ్..

ఓ లుక్కేద్దాం...రండి...

ప్రకృతితో మమేకమయ్యేందుకు నిర్మల్ సమీపంలోగల గండిరామన్న హరితవనం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా నిలుస్తోంది. జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ హరిత వనం ఉండగా నిత్యం వందలాది మంది ప్రజలు ఈ పార్క్‌ను సందర్శిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో పట్టణ ప్రజలే కాక ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే అనేక మంది ఇక్కడ ఆగి సేద దీరుతారు. ఉదయం వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అనువుగా పలు ప్రదేశాలు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్క్, వాచ్‌టవర్, క్యానోపివాక్ సౌకర్యం కలదు. తెల్లవారుజామున వందలాది సంఖ్యలో దర్శనం ఇచ్చే నెమళ్లు, పలు రకాల పక్షుల కిలకిలరావాలతో మనస్సుకు ఒకింత ఆహ్లాదం కలుగుతుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపులపై సందర్శకులు నడుస్తున్నప్పుడు చక్కటి అనుభూతి పొందుతారు. కోతులు, జింకలకు ఇక్కడ సంరక్షణ కేంద్రాలున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రవేశ రుసుముతో పాటు సఫారి వాహన సౌకర్యం కల్పించారు. సందర్శకులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

మరింత అభివృద్ధి జరగాలి



నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోగల పర్యాటక ప్రదేశాల్లో వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. టూరిజం శాఖ మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు కాకముందే వాటిని సంరక్షించుకుంటే భావితరాలకు పురాతన చరిత్రను అందించే అవకాశం ఉంటుంది.

– గందం రత్నాకర్, నిర్మల్

వసతులు మెరుగుపర్చాలి



నిర్మల్‌కు చారిత్రాత్మకంగా మంచి గుర్తింపు తేవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి కోటలు, కందకాలు, బురుజులు నాటి పరిపాలనా కాలాన్ని తెలుపుతాయి. వసతులు మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్

చారిత్రక కోటలెన్నో...


ఖిల్లాగుట్ట

నిర్మల్ పట్టణం శివారులో గొలుసుకట్టు చెరువులతోపాటు ఆనాటి పాలకుడైన నిమ్మలనాయుడు పట్టణం చుట్టూ ప్రధానమైన రక్షణగోడ నిర్మించాడు. చెరువులను అనుసంధానం చేస్తూ కందకాలు నిర్మించాడు. నాటి ఆనవాళ్లను చూపే బత్తీస్‌ఘడ్, శ్యాంఘడ్, ఖిల్లా గుట్ట, (రాజసౌధం) తదితర చూడదగిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

వందేళ్ల చరిత్ర కలిగిన సోన్ వంతెన


ప్రాచీన కాలంనాటి సోన్ వంతెన

నిర్మల్–నిజామాబాద్ జిల్లాలను కలిపే సోన్ గోదావరి నదిపైన నిజాం కాలంలో వందేళ్ల క్రితం నిర్మించిన పొడవైన వంతెన ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. నూతనంగా నిర్మించిన వంతెన ఉన్నప్పటికీ పురాతన వంతెన చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

సహజత్వం ఉట్టిపడేలా కొయ్యబొమ్మలు


కొయ్యబొమ్మల తయారీలో కళాకారులు

నిర్మల్ పేరు వినగానే కొయ్యబొమ్మలు గుర్తొస్తాయి. సహజత్వం ఉట్టిపడేలా ఇక్కడి కళాకారులు పొనికి కర్రతో తయారు చేసే కొయ్య బొమ్మల్లో ఆకర్శించే గుణం ఉంది. శిల్పకళ, చిత్రకళలో ఆరితేరిన నిపుణులకు నిర్మల్ నెలవుగా ఉంది. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నిర్మల్ పెయింటింగ్స్‌కు, కొయ్యబొమ్మలకు నిలయంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది.

ప్రకృతి రమణీయత...


గండిరామన్న హరితవనం

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ప్రకృతిని అస్వాదించేలా దట్టమైన అడవులు, వంపుతిరిగిన రోడ్లు మనస్సుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. కొరటికల్, మొండిగుట్ట, బూర్గుపెల్లి, తాంద్ర, తదితర గ్రామాలు ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. పచ్చదనం పరుచుకుని ఉన్న ప్రకృతిఒడిలో సేద తీరటానికి అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

హత్యకేసు ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

మామడ(నిర్మల్): ఈ నెల 25న పొన్కల్ శివారులో యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం మామడ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పొన్కల్ గ్రామానికి చెందిన తాటికొండ వినోద్ (28)ను బండల ఖానాపూర్‌కు చెందిన బాదావత్ రాజు, బాదావత్ కిషోర్, బాదావత్ జైసింగ్ కలిసి హత్య చేశారు. 2021 జనవరిలో బండల ఖానాపూర్‌కు చెందిన బాదావత్ జైసింగ్ కుమారుడు మధు పొన్కల్‌లో ఉంటున్న తాటికొండ వినోద్ ఇంటికి వచ్చి బైక్‌పై స్వగ్రామం తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో మృతి చెందాడు. తన కుమారుడిని వినోద్ హత్య చేశాడనే అనుమానంతో జైసింగ్ పగ పెంచుకున్నాడు. ఈక్రమంలో వినోద్ ఇటీవల బండలఖానాపూర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా కూలీ పనులు చేస్తున్నాడు. ఇదే అదునుగా భావించిన జైసింగ్ తన కుమారుడు రాజు, తన సోదరుడి కుమారుడు బాదావత్ కిషోర్‌తో కలిసి హత్యకు పథకం వేశారు.

పార్టీ చేసుకుందామని పిలిచి..

25న కిశోర్ పొన్కల్‌కు వెళ్లి పార్టీ చేసుకుందామని చెప్పడంతో ఒప్పుకున్న వినోద్ గుడుంబా కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై బండల ఖానాపూర్ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో రాజును ఎక్కించుకుని పొన్కల్ శివారులోని అటవీప్రాంతంలో మద్యం సేవించారు. ఇదే క్రమంలో రాజు కత్తితో వినోద్‌ను పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అటవీప్రాంతంలో పడేశారు. వినోద్ సెల్‌ఫోన్‌ను ఒర్రెలో, రక్తం మరకలు కలిగిన బట్టలను బావిలో పడేశారు. అప్పటి నుంచి ఇద్దరూ పరారీలో ఉన్నారు. ఈ నెల 27న మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జైసింగ్‌ను అరెస్ట్ చేసి విచారించగా నేరం ఒప్పుకున్నాడు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై అశోక్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

అన్యాయానికి గురవుతున్న ఆదివాసీలు

- మానవ హక్కుల ఐక్యవేదిక ఉమ్మడి రాష్ట్ర సమన్వయకర్త వీఎస్ కృష్ణ
- గుడిహత్నూర్‌లో ఆదివాసీ సేన తృతీయ రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న వీఎస్ కృష్ణ

గుడిహత్నూర్: ఉమ్మడి రాష్ట్రంలోని ఆదివాసీలు చారిత్రక అన్యాయానికి గురవుతున్నారని మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్ర సమన్వయకర్త వీఎస్ కృష్ణ అన్నారు. ఆదివాసీ సేన తృతీయ రాష్ట్ర మహాసభలు మండలకేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలు ఉన్న గ్రామాలను పూర్తి స్థాయిలో నోటిఫైడ్ చేయకపోవడంతో ఆయా గూడేల్లో ఉన్న ఆదివాసీలు అన్ని రకాల హక్కులను కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా నేడు ఉమ్మడి రాష్ట్రంలో 805 గిరిజన గ్రామాలు, ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 106 గ్రామాల్లో ఆదివాసీలు ఏజెన్సీ ఫలాలు అందలేక పోతున్నారన్నారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మరో 11కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చూడడాన్ని ఆదివాసీలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్ మాట్లాడుతూ, ఆదివాసీ సంఘాలను ఏకతాటిపై తెచ్చి ఐక్యవేదిక ఏర్పాటు చేసి ఉమ్మడిగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద గల కుమురంభీం విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సామాజిక పరిశోధకులు ఎస్.ఉషా సీతాలక్ష్మి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, ఉపాధ్యక్షుడు కుమురం అనిల్‌కుమార్, సేన నాయకులు శరత్‌బాబు, అరుణ, జంగు, దశరథ్, లక్ష్మణ్, కోటేశ్వర్, తిరుపతి, రవి, రామకృష్ణ, ఆదినారాయణ, ఉమ్మడి జిల్లా పటేళ్లు పాల్గొన్నారు.

నియమ నిష్టలతో హజ్‌యాత్ర చేయాలి


మాట్లాడుతున్న ముఫ్తీ అసీఫొద్దీన్ నద్వీ

ఆదిలాబాద్‌టౌన్: ముస్లింలు నియమ నిష్టలతో హజ్ యాత్ర చేయాలని మాస్టర్ ట్రైనర్ ముఫ్తీ అసీఫొద్దీన్ నద్వీ అన్నారు. ఆదిలాబాద్ హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది హజ్‌యాత్రకు వెళ్లే వారికి శనివారం టీఎన్జీవోస్ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాత్ర సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 7 నుంచి మక్కాకు విమానాలు ఉంటాయన్నారు. యాత్రకు వెళ్లే వారికి అనేక సందేహాలుంటాయని, వాటిని నివృత్తి చేయడంతో పాటు అక్కడ ఆచరించే ప్రార్థనల గురించి పూర్తిగా వివరించామన్నారు. హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి ఈసారి 340 మంది బయలుదేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నజీరొద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు అబుబాకర్, అసీఫొద్దీన్, అక్బార్, హసిబ్, అబ్దుల్ షాహిద్, అమీమ్ షరీఫ్, ఖిజర్ యాఫై, అస్మాత్ అలీ, షేక్ మోయిజ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు పట్టివేత

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి స్టేజీ వద్ద శనివారం పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సాంబశివారెడ్డి, అలియాస్ శివయ్య, డ్రైవర్ శ్రీకాంత్‌గౌడ్ మ్యాజిక్ పికప్ వెహికల్‌లో సుమారు 8 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు కన్నెపల్లి మండలానికి తరలిస్తుండగా కన్నెపల్లి పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షలకుపైగా ఉంటుందని వ్యవసాయాధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

నేరడిగొండ(బోథ్): రోడ్డు ప్రమాదంలో బాలుడు గాయాలపాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆడెపు చరణ్ శనివారం తన చిన్నాన్నతో దశరథ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయక్షేత్రానికి వెళ్తుండగా అదుపు తప్పి కిందపడడంతో చరణ్‌కు గాయాలయ్యాయి. వెంటనే 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

బిల్డింగ్ పైనుంచి పడి వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానిక శ్రీశ్రీనగర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం (ఆనందనిలయం)లో నస్పూర్ మండలంలోని సీతారాంపల్లెకు చెందిన దామరకొండ బీరయ్య(70) కొంతకాలంగా అనాథగా ఉంటున్నాడు. శనివారం తన బట్టలు ఆరేసేందుకు బిల్డింగ్ పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

సమ్మర్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న దిలీప్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న సమ్మర్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ సమ్మిట్ కేంద్రాన్ని సందర్శించారు. మే 1 నుంచి 15 వరకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన 50 మంది బాలికలకు ఆదిలాబాద్‌లో, మరో 50 మంది బాలురకు ఉట్నూర్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుట్లు, అల్లికలు, మెహందీ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్, కల్చరల్, నృత్యం, పాటలు, సాహిత్యం, కంప్యూటర్, తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం తరగతి గదులు, వంటశాల, వసతిగృహ గదులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీఎంవో జగన్, ఏటీడీవో నిహారిక, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అశోక్, ఉదారి నారాయణ, తదితరులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కుంటాల(ముధోల్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. కుంటాలకు చెందిన ముజ్జంటి భోజన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే భైంసా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి తుంగన్న ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.40వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఘటన స్థలాన్ని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పరిశీలించారు.

క్లుప్తంగా

వీధికుక్కల బెడద తీర్చాలి

భైంసాటౌన్: పట్టణంలోని నాలుగో వార్డులో వీధికుక్కల బెడద తీర్చాలని వార్డు కౌన్సిలర్ చందూలాల్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కాలనీలో ముగ్గురు చిన్నపిల్లలపై కుక్కలు దాడిచేశాయని, పిల్లలు, పెద్దలు కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ నుంచి చర్యలు తీసుకోవాలని ఆయన వినతిలో కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు



సమ్మెలో పాల్గొన్న జనసేన నాయకులు

భైంసారూరల్: భైంసా మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు శనివారం జనసేన మద్దతు పలికారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకుడు సుంకెల మహేశ్ మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల ప్రొబేషనరీని సర్వీసుగా గుర్తించాలన్నారు. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

శాకంబరీగా అమ్మవారు



ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు భక్తులు అమ్మవారిని కూరగాయలతో శాకంబరీగా శనివారం అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జితేందర్, కమిటీ సభ్యులు, అర్చకులు అభిషేక్ శర్మ పాల్గొన్నారు.

అధికారులకు అదనపు బాధ్యతలు

లక్ష్మణచాంద: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండడంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా ఎంపీడీవో కార్యాలయంలో పలువురి అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఎంపీడీవో మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. వడ్యాల్, వడ్యాల్ తండా, కనకాపూర్, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాలు ఎంపీవో నసీరుద్దిన్‌కు, పొట్టపెల్లి(కే) గ్రామం సూపరింటెండెంట్ రమేశ్‌కు, సీనియర్ అసిస్టెంట్ శివరామ్ (న్యూకంజర), గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజు (పార్‌పెల్లి, తిర్పెల్లి), గ్రేడ్ 3 పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ (మల్లాపూర్, చామన్‌పెల్లి, చింతల్‌చాంద, మునిపెల్లి), గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్ (ధర్మారం, రాచాపూర్, బోరిగాం గ్రామాల)కు ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

తపాలా కార్యాలయం ప్రారంభం

కుభీర్: మండలంలోని సిర్పెల్లి గ్రామంలో నూతనంగా తపాలా కార్యాలయాన్ని భైంసా సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మిత బెనర్జీ శనివారం ప్రారంభించారు. సర్పంచులు జాదవ్ అశ్విని, రాథోడ్ బాలాజీ, ఉప సర్పంచ్ బబ్లుసింగ్, అధికారులు ఉన్నారు.
కడెం: రాణిగూడ, కొత్తతండా గ్రామాల్లో పోస్టల్ కార్యాలయాలను నాయకులు ప్రారంభించారు. ఐపీవో షఫీవొద్దీన్, సర్పంచులు సదర్లాల్, భీంబాయి, ఎంపీటీసీ దాసునాయక్, బీపీఎంలు శ్రీనివాస్, మారుతి పాల్గొన్నారు.
పెంబి: పస్పుల, దోందారి, గంగాపూర్, వెంకంపోచంపాడ్ గ్రామాల్లో పోస్టల్ కార్యాలయాన్ని నిర్మల్ సబ్ డివిజన్ అధికారి షఫీఉద్దీన్ ప్రారంభించారు.

జర్నలిస్టుపై దాడి చేసిన సర్పంచ్‌పై కేసు

ఖానాపూర్: పట్టణంలో జర్నలిస్టు రాసమల్ల భాస్కర్‌ను చంపుతానని బెదిరించి దుర్భాషలాడిన ఎక్బాల్‌పూర్ సర్పంచ్ గుగ్లావత్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. జర్నలిస్టుపై దాడికి పాల్పడ్డ సర్పంచ్ పదవి నుంచి లక్ష్మణ్‌ను తొలగించి బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం వారు నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌తోపాటు పలువురు నాయకులు వారికి మద్దతు తెలిపారు.

అభివృద్ధి చేస్తే ఆహ్లాదమే..!



భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద పార్క్

- గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ వద్ద పార్క్‌లో కనిపించని వసతులు
- సందర్శనకు ఆసక్తి చూపని పట్టణవాసులు



పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి(ఫైల్)

భైంసాటౌన్: భైంసా పట్టణశివారులో గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణవాసులు చాలామంది వాకింగ్, యోగా కోసం వస్తుంటారు. ప్రాజెక్టు సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో పార్క్ గతంలోనే ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ పార్క్ స్థలంలోనే క్రీడాప్రాంగణం కూడా ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు చూసేందుకు పిల్లలు, మహిళలు కుటుంబ సమేతంగా వస్తుంటారు. బతుకమ్మ, వినాయక, దుర్గా విగ్రహాల నిమజ్జనోత్సవాల సందర్భాల్లోనూ ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి పార్క్‌లో కాసేపు ఆహ్లాదంగా గడుపుదామంటే సరైన వసతులు లేక నిట్టూరుస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఎలాంటి పరికరాలు ఏర్పాటు చేయలేదు. వాకింగ్ ట్రాక్ మినహా ఎలాంటి వసతులు లేవు. దీంతో సెలవుదినాల్లో, ఉదయం, సాయంత్రం వేళల్లో కుటుంబసభ్యులతో సరదాగా పార్క్‌లో గడుపుదామనుకునే పట్టణవాసులకు నిరాశే మిగులుతోంది. పార్క్‌ను అభివృద్ధి చేసి పిల్లలు, పెద్దల కోసం వసతులు కల్పిస్తే పట్టణవాసుల నుంచి ఆదరణ పెరుగుతుంది. ఇటీవల కలెక్టర్ వరుణ్‌రెడ్డి సైతం పార్క్‌ను సందర్శించి పిల్లలు, పెద్దల కోసం ప్రత్యేకంగా వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వాచ్‌టవర్ ఏర్పాటు చేస్తే సందర్శకులకు ప్రయోజనకరంగా ఉంటుందని సైతం సూచించారు. దీంతో పార్క్‌ను అభివృద్ధి పరిచి ఆహ్లాదం పంచాలని పట్టణవాసులు పలువురు కోరుతున్నారు.

పర్యాటకంగా అభివృద్ధి

భైంసా గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రాజెక్టు వద్ద బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తే సందర్శకుల తాకిడి పెరిగే అవకాశముంది. అలాగే ప్రస్తుతం ఉన్న పార్క్‌లో అన్ని వసతులు కల్పిస్తే పట్టణవాసులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం సందర్శకులు పెరుగుతారు. పార్క్‌లో పచ్చదనంతోపాటు ఫౌంటెయిన్ ఏర్పాటు, పిల్లల కోసం ఆట వస్తువులు, వృద్ధులు సేదతీరేందుకు కుర్చీలు, చిరుతినుబండారాల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద పార్క్ అభివృద్ధి కోసం గతంలో రూ.కోటి గడ్డెన్న స్మృతివనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. పార్క్‌లో దివంగత మాజీ మంత్రి గడ్డెన్న విగ్రహం ఏర్పాటుతోపాటు పార్క్ మధ్యలో ఫౌంటెయిన్, క్యాంటీన్ కోసం ప్రతిపాదించాం. కలెక్టర్ సూచన మేరకు వాచ్‌టవర్ కోసం సైతం ప్రతిపాదిస్తాం.
– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, భైంసా

సంక్షిప్త వార్తలు

‘మన్ కీ బాత్’ విజయవంతం చేయండి
లక్ష్మణచాంద/కుంటాల/నర్సాపూర్: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించే ‘మన్ కీ బాత్’ వందో ఎపిసోడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి కోరారు. లక్ష్మణచాందలోని ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలు, ముఖ్య నాయకులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త వీక్షించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, నాయకులు కలమల్ నయన్ పాల్గొన్నారు. కుంటాలలో పార్టీ మండల కన్వీనర్ గుడ్డెటి నర్సయ్య, నర్సాపూర్(జి)లో మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని కార్యకర్తలు వీక్షించాలన్నారు. నర్సాపూర్(జి)లో బీజేపీ మండల కార్యదర్శిగా పర్స మహేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాజును ఎన్నుకున్నారు.

పేదలకు నిత్యావసరాలు అందించాలి
ఖానాపూర్/లక్ష్మణచాంద: రేషన్‌షాపుల ద్వారా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమత, లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఖానాపూర్ తహసీల్దార్ రాజమోహన్‌కు, లక్ష్మణచాందలో డీటీ గంగాధర్‌కు వినతిపత్రాలు అందజేశారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని వంటగ్యాస్ ధరను తగ్గించాలన్నారు. ఎస్.లక్ష్మి, కవిత, పద్మ, జ్యోతి, సుమలత పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన
ఖానాపూర్: పాత తర్లపాడ్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీపీ మోహిద్ శనివారం పరిశీలించారు.

నేడు విపశ్యన ధ్యానంపై అవగాహన
నిర్మల్‌చైన్‌గేట్: మయూరి హోటల్‌లో ×విపశ్యన ధ్యానంపై ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు అవగాహన కార్యక్రమం ఉందని ధ్యానకేంద్రం ప్రతినిధి తెలిపారు. వివరాలకు 8499985115 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పార్టీకి రాజీనామా
ఖానాపూర్: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సాబీర్ పాషా శనివారం ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి రాజీనామా లేఖ పంపించాడు.

ప్రెస్‌క్లబ్‌కు భవనం కేటాయించాలని వినతి
సోన్: మండల కేంద్రంలో పాత్రికేయులు ఇటీవల ఏర్పాటు చేసుకున్న ప్రెస్‌క్లబ్‌కు ప్రభుత్వ భవనం కేటాయించాలని కోరుతూ ఆర్ఐ రఫీకి వినతిపత్రం అందించారు. రవీందర్, రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం
నర్సాపూర్(జి): ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని నిర్మల్ ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ రాజశేఖర్ అన్నారు. నిర్మల్ డిపో ఆధ్వర్యంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులకు బస్‌చార్జీలో 50శాతం రాయితీతో కూడిన బస్ పాసులను అందజేశారు. సర్పంచ్ రాంరెడ్డి, ఆర్టీసీసిబ్బంది ఉన్నారు.

మెరుగైన వైద్యం కోసం తరలింపు
సారంగాపూర్: జామ్‌కు చెందిన ఊరె జ్యోతి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించే ఏర్పాట్లు చేశారు. ఏలేటికి ఆమె తండ్రి భోజన్న కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహప్రతిష్ఠాపన
కుభీర్: కస్రా తండాలో నూతనం తయారు చేసిన రామారావ్ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీక్షా గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ పూజలు చేశారు. తండా నాయక్ విజయ్, కారోబారి బుద్రాజి, రంజని తండానాయక్ సాహెబ్రావ్ ఉన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత
ఖానాపూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బోద మల్లేశ్, జామీరుద్దీన్‌లకు సీఐ నారాయణనాయక్ అప్పగించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్‌లో నంబర్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేస్తే, త్వరగా మొబైల్ ట్రేస్ చేసి పట్టుకోవచ్చునని అన్నారు. ఎస్సై ఆర్ శంకర్, నాయకులు రాజశేఖర్, కానిస్టేబుల్ రవి ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన
తానూరు: (నాబార్డ్), సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం ఆర్థిక అక్ష్యరాస్యతపై కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. కిసాన్ కార్డు, రూపేకార్డు ద్వారా ప్రమాదబీమాపై బృందం సభ్యులు రమేశ్, నారాయణ్ కృష్ణ వివరించారు. సొసైటీ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, సర్పంచ్ విఠల్, నాయకులు మాధవ్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- రూ.24 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ సబియాబేగం, కమిషనర్ వెంకటేశ్వర్లు

భైంసాటౌన్: భైంసా మున్సిపల్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. చైర్‌పర్సన్ సబియా బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూ.24 లక్షలతో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేయగా, కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. రూ.5 లక్షలతో వైకుంఠధామం ప్రహరీ నిర్మాణం, రూ.2 లక్షలతో ప్లంబింగ్, శానిటరీ పనులతోపాటు మరో రూ.2 లక్షలతో ఎలక్ట్రికల్ పనుల కోసం ప్రతిపాదించారు. అలాగే ఎనిమిదో వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, టిప్పుసుల్తాన్ చౌక్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు మరమ్మతు, కల్వర్టు స్లాబ్ పనులకు ప్రతిపాదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



కనకాపూర్‌లో నివాళులర్పిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌కు చెందిన పాత్రికేయుడు రాజాగౌడ్ తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్రమంత్రి ఐకేరెడ్డి శనివారం రాజాగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వనర్ క్రిష్ణారెడ్డి, పార్టీ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, నాయకులు ముత్తన్న, రాజేందర్, నారాయణ ఉన్నారు.
సారంగపూర్: ప్యారమూర్ గ్రామానికి చెందిన లోకేష్‌రెడ్డి విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని, ఆయన తండ్రి పాపారెడ్డిని మంత్రి ఐకేరెడ్డి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన సుదర్శన్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడగా పరామర్శించారు. ఇటీవల రెండు కిడ్నీలకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ప్రవీణ్ ఇంటికి వెళ్లి ఆరోగ్యపరిస్థితిని గురించి తెలుసుకున్నారు. మండల పార్టీ ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరావు తదితరులు ఉన్నారు.
– గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన మంతెన గంగారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్ పరామర్శించారు.
సోన్: న్యూ బొప్పారంలో లింగారెడ్డి, లసుంబాయి, పాక్‌పట్లలో గంగవ్వ మృతి చెందగా, బాధిత కుటుంబాలను మంత్రి ఐకేరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ప్రముఖ పారిశ్రామికవేత్త మురళీధర్ రెడ్డి, సారంగాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోయినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ క్రిష్ణప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి ఉన్నారు.
నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హనుమంజి గుట్ట ప్రాంతంలో రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో హమీర్ పునిస్సా ఇల్లు దగ్ధమైంది. శనివారం ఆ ఇంటిని మంత్రి ఐకేరెడ్డి పరిశీలించి బాధిత కుటుంబానికి తక్షణ సాయం రూ.95 వేలు మంజూరు చేస్తామన్నారు. నెలలోపు రూ.3 లక్షలతో ఇంటిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బియ్యం, నిత్యవసర సరుకులు, రూ.10 వేల నగదు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో శనివారం క్షీరాభిషేకం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ తుర్పాటి వెంకటేష్, మైనార్టీ నాయకులు ఖదీర్, హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్లలో ఎమ్మెలను మర్యాదపూర్వకంగా కలిశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాత్రి, నాయకులు జట్టు మహేందర్, వెంకటేష్, తాటి మహేశ్వర్, పోశెట్టి, సబ్బిడి గజేందర్, భోగ లక్ష్మణ్, రాకేశ్, మహిపాల్, రమేశ్, అనిల్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కుంటాల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని మెదన్‌పూర్ గ్రామంలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 56 బైక్‌లు, 3 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలు నమ్మవద్దని అన్నారు. నిషేధిత వస్తువులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచితులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్సైలు హన్మాండ్లు, శ్రీకాంత్, షరీఫ్, రాందాస్, దేవ్‌రావు, సర్పంచ్ చంద్రకాంత్ పటేల్, డైరెక్టర్ నారాయణ్‌పటేల్ పాల్గొన్నారు.

మదినిండా జ్ఞాపకాలు



శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

- శిశుమందిర్‌లో అపూర్వ సమ్మేళనం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బుధవార్‌పేట్‌లో శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1989–97 వరకు ఏడో తరగతి చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి మున్నూరుకాపు సంఘ భవనం వేదికైంది. ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానాచార్యులు మనోహర్‌వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 50 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. 26 ఏళ్ల తర్వాత అనంతరం ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, అప్పటి మధుర జ్ఞాపకాలతో ఉల్లాసంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ బాల్య మిత్రులను కలుసుకోవడానికి తరలివచ్చారు. ఉపాధ్యాయులతో కలిసి ఫొటోలు దిగి అంత్యాక్షరి, ఆట, పాటలు ఆడిపాడారు.

సంతోషంగా ఉంది



నేను 36 ఏళ్ల నుంచి శిశు మందిరాల్లో పని చేస్తున్నా. ప్రస్తుతం మంచిర్యాల శిశు మందిర్‌లో విధులు నిర్వహిస్తున్నా. తిరిగి ఇప్పుడు ఇక్కడికి వచ్చి అందరినీ కలవడం సంతోషంగా ఉంది. అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. నిర్వాహకులకు అభినందనలు.
– మనోహర్ వర్మ, ప్రధానాచార్యులు

26 ఏళ్ల తర్వాత..



26 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు గుర్తుపెట్టుకొని గురువులను సన్మానించడం సంతోషంగా ఉంది. శిశుమందిరాల్లో 1983 నుంచి 2004 వరకు విద్యార్థులకు బోధించా. ఉపాధ్యాయ వృత్తి నాకు సంతృప్తినిచ్చింది. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే మాకు ఎంతో సంతోషంగా ఉంది.
– వినీత, ఉపాధ్యాయురాలు

బాల్య స్నేహితులను కలుసుకున్నా..



నేను 1989–97లో ఏడో తరగతి వరకు బుధవార్‌పేట్ శిశు మందిర్‌లో చదువుకున్నాను. ఎస్ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశాను. ఇన్నాళ్లకు బాల్యమిత్రులను కలుసుకునే అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా మాట్లాడుకున్నాం. యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నాం.
– సద్గుణ, హైదరాబాద్

బాల్యంలోకి వెళ్లినట్టు..



చిన్ననాటి మిత్రులందరినీ కలిసి పాల్గొనడంతో తిరిగి బాల్యంలోకి వెళ్లిన అనిపిస్తుంది. ఈ టైంలో బడి జ్ఞాపకాలు గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉంది. అప్పటి మా గురువులను కలుసుకున్నాం.
– రవీందర్‌రెడ్డి, పూర్వ విద్యార్థి

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

భైంసాటౌన్: విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బాసర ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సురేశ్‌జోషి, పీఈటీ లత కోరారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని, ప్రతిరోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు క్రీడల్లో, 9 నుంచి 10 గంటల వరకు ఆంగ్లం, గణితం, విజ్ఞానశాస్త్రం సంబంధ అంశాల్లో విద్యార్థులకు బోధన ఉంటుందన్నారు. బాసరలోని ప్రభుత్వ పాఠశాలతోపాటు మండలంలోని ఓని, కౌట, బిద్రెల్లి పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న శిబిరాల్లో నలుగురు వలంటీర్లను అందుబాటులో ఉంచామని సర్పంచ్ లక్ష్మణ్‌రావు తెలిపారు.
కడెం: లింగాపూర్, కడెం, అంబారిపేట్, ధర్మాజీపేట్, పెద్దబెల్లాల్, పాత మద్దిపడగ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో మే 1 నుంచి 31 వరకు వేసవి శిబిరాలుంటాయని మండల ఇన్‌చార్జి బోయిని వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.
ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఉన్నతపాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు పేర్కొన్నారు. మే 1 నుంచి 31 వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10.30 వరకు వాలీబాల్, మార్షల్ ఆర్ట్స్, కరాటే పోటీలు తదితర వాటిపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనలో యథేచ్ఛగా అక్రమాలు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నాయని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. మండలంలోని సుర్జాపూర్‌లో 71వరోజు శనివారం ఇంటింటికీ బీజేపీలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు ఉపాధి కూలీల పనిచేసే చోటకు వెళ్లి వారితో మాట్లాడారు. నాయకులు నర్సాగౌడ్, నాయిని సంతోష్, రాచకొండ సాగర్, ఎనగందుల రవి, రాము, బుచ్చన్న, రవీందర్‌రెడ్డి, మహేందర్, భూమన్న, అనిల్‌రావు, శివ, శ్రీనివాస్, కిషన్, మల్లేశ్, రుస్తుం, రాజన్న, లింబాద్రి, కమలాకర్, రమేశ్, వెంకట్రాములు, ఉన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

సారంగపూర్/కడెం/భైంసారూరల్/లోకేశ్వరం/కుంటాల/లక్ష్మణచాంద/నర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా వీవోఏల సమ్మె కొనసాగుతోంది. సారంగపూర్‌లో వీరి సమ్మెకు కాంగ్రెస్ నాయకుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారితో కలిసి భోజనాలు చేశారు. కడెంలో నియోజవర్గ కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, నాయకులు వీవోఏలకు మద్దతు ప్రకటించారు. భైంసాలో సమ్మె 11వ రోజుకు చేరింది. లోకేశ్వరంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్‌లు వీవోఏల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కుంటాలలో వీవోఏలు వేపాకులు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మణచాందలో వీవోఏలు ‘బలగం’సినిమాలోని పాట పాడుతూ భజన చేశారు. నర్సాపూర్(జి)లో రోడ్లు ఊడుస్తూ నిరసన తెలిపారు.